సాక్షి
బాపట్ల

ఆదివారం । 26 । నవంబర్ । 2023



పాఠశాల వాహనాలపై కేసు

పట్నంబజారు: జిల్లా రవాణా శాఖ అధికారులు శనివారం గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. 12 ఆటోలు, రెండు స్కూలు బస్సులపై కేసు నమోదు చేశారు.



ఘనంగా శోభాయాత్ర

అమరావతి: అయోధ్య నుంచి శ్రీరాముని పూజించిన అక్షింతల కలశానికి శనివారం అమరావతిలో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరామ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు శనివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

న్యూస్‌రీల్

నేడు అమరేశ్వరుని తెప్పోత్సవం




అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతిలో కార్తికపౌర్ణమి సందర్భంగా ఆదివారం అమరేశ్వరునికి వైభవంగా తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్తికపౌర్ణమి పర్వదినాన అమరేశ్వరాలయాన్ని సందర్శించే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా క్రమ పద్ధతిలో క్యూలైన్లను ఏర్పాటుచేసి పోలీస్‌శాఖ సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ, దేవాలయం, స్నానఘాట్‌లలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు ఉచిత ప్రసాదం, సుమారు 50వేల లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్నామన్నారు. ఆదివారం రాత్రికి స్వామి వారి గ్రామోత్సవం, అనంతరం కృష్ణా నదిలో వైభవంగా తెప్పోత్సవం, జ్వాలాతోరణం ఉత్సవం నిర్వహించటానికి వివిధ ప్రభుత్వశాఖలతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

డిసెంబర్ 13లోగా దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారిత కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులకు డిసెంబరు 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ పీడీ బి.అరుణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలల సంరక్షణ యూనిట్ (డీపీయు)లో 12 పోస్టులు, శిశు సంరక్షణ కేంద్రంలో 11 పోస్టులు (కేవలం మహిళలకే), పిడుగురాళ్లలోని చిల్డ్రన్స్ హోమ్‌లోని ఎనిమిది పోస్టులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ పద్ధతి ప్రకారం భర్తీచేయబడతాయన్నారు. అభ్యర్థులు ఈ ఏడాది జూలై నాటికి 18 ఏళ్ల నుంచి 42 ఏళ్లలోపు వారై ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు నరసరావుపేటలోని కార్యాలయానికి తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమకాలువకు 4,034, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 839.30 అడుగుల వద్ద ఉంది.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- వికసిత్ భారత్ సంకల్ప యాత్ర వాహనం ప్రారంభం



వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి బాటలో పయనించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. కేంద్ర నుంచి వచ్చిన వికసిత్ సంకల్ప యాత్ర వాహనాన్ని బాపట్ల మండలం ఈతేరు గ్రామంలో జిల్లా కలెక్టర్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. వాహనంలో ఏర్పాటుచేసిన ఎల్ఈడీ స్క్రీన్, అందులో ప్రసారమవుతున్న 7.5 నిమిషాల నిడివిగల లఘు చిత్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రజలతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. లబ్ధిదారులు తమ అనుభవాలను వివరించారు. ప్రజలను చైతన్యపరుస్తూ ప్రదర్శించిన నాటికలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మీ జీవితాలలో మార్పు తీసుకురావడానికే కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. గ్రామాలలో ప్రజలను చైతన్య పరచడానికి కేంద్ర ప్రభుత్వం వికసిత్ సంకల్ప యాత్రను చేపట్టిందన్నారు. ఇప్పటి నుంచి 2024 జనవరి 26వ తేదీ వరకు జిల్లాలోని 459 పంచాయతీలలో యాత్ర సాగుతుందన్నారు. ఇందుకోసం జిల్లాకు నాలుగు వాహనాలు కేంద్రం నుంచి వచ్చాయన్నారు. ప్రతిరోజూ నాలుగు రూట్‌లలో వాహనాలు పర్యటించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేకంగా అధికారులతో కమిటీలు నియమించామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, ఏదైనా కారణాలతో మిగిలిపోయి అర్హులైన వారికి పథకాలను వర్తింప చేయడమే ముఖ్యోద్దేశం అన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆయా పథకాల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. మెరుగైన జీవన ప్రమాణాలతో ప్రజలంతా సాధికారత వైపు అడుగులు వేసేలా కేంద్ర ప్రభుత్వం మార్గం సుగమం చేస్తుందన్నారు. మీ జీవితాలను మార్చుకొని అభివృద్ధి దిశగా పయనించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు. పక్కా గృహాల నిర్మాణం, ఇంటింటికి కొళాయి కనెక్షన్‌తో తాగనీరు వంటి 17 రకాల పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, డీపీఓ డి.రాంబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ప్రస్తావన కరపత్రాల ఆవిష్కరణ సంతోషకరం

నవంబర్ 26 రాజ్యాంగం ఆమోదింపబడిన రోజు సందర్భంగా భారత రాజ్యాంగం ప్రస్తావన కరపత్రాలను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సామాన్యులకు చేరువై భావాన్ని తెలుసుకునే విధంగా రాజ్యాంగ ప్రస్తావనను కరపత్రాల రూపంలో రూపొందించడం సంతోషకరమన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన లక్ష్యాలు ఈ కరపత్రాల్లోని అంశాలను అందరూ చదువుకుని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌దిబోరా, బాపట్ల జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కట్ట శ్రీనివాసరావు, గుదే రాజారావు, పొందుగల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పీఠిక, ప్రాథమిక విధులపై బోర్డులు

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వినూత్న చర్యలకు పల్నాడు కలెక్టర్ ఆదేశం

నరసరావుపేట: ప్రతి పౌరుడు, విద్యార్థినీ విద్యార్థులకు రాజ్యాంగ పీఠిక, ప్రాథమిక విధులపై అవగాహన కల్పించే విధంగా జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంతోపాటు ప్రతి ప్రభుత్వ కార్యాలయం, పాఠశాలల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని మండల అధికారులు, ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. వాటి ఎదుట నిలబడి ప్రతి ఒక్కరూ చదివేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యార్థినీ విద్యార్థులకు అర్థమయ్యేలా ప్రతిజ్ఞలు చేయించాలన్నారు. ఈ ప్రక్రియ వచ్చే ఏడాది జనవరి 26 అనంతరం కూడా నిరంతరం కొనసాగాలని ఆయన ఆదేశించారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో...

గ్రూప్-1, 2 ఉద్యోగ పరీక్షలపై

ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 2వ తేదీన గుంటూరులో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్-1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్-1,2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్-1,2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www. sakshieducation. com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం అందరికీ తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత..

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గారు గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్ 1,2 పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నెంబర్‌కు పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపగలరు.

అవగాహన సదస్సు తేదీ
డిసెంబర్ 2, 2023(శనివారం)

వేదిక
ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీ (ఏసీ కాలేజ్), గవర్నమెంట్ ఆసుపత్రి పక్కన, సాంబశివ పేట, మెయిన్ రోడ్ గుంటూరు

సమయం
ఉదయం 9.30 నుంచి 12.30 వరకు

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 8977625795

ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

గుంటూరుమెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం ద్వారా, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఈనెల 10న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా శనివారం విడుదల చేశామన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 30వ తేదీలోపు డీఎంహెచ్ఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా అందజేయాలని వెల్లడించారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

సమ్మెటివ్-1 పరీక్షలకు సర్వం సిద్ధం

యడ్లపాడు: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మదింపునకు విద్యాశాఖ ఏటా క్లాస్‌రూంబేస్డ్ (సీబీఏ), ఫార్మేటివ్(ఎఫ్ఏ), సమ్మేటివ్(ఎస్ఏ) అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 1-10 తరగతుల విద్యార్థులకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ సిద్ధమౌతోంది. ఈనెల 28 నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు జరిగే పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) ప్రకటించింది.

రేపు సూర్యలంకలో భూగర్భ సాగర హారతి

- కార్తిక పౌర్ణమి సందర్భంగా లక్ష మందికిపైగా భక్తులు హాజరు
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు

బాపట్ల అర్బన్: సోమవారం కార్తిక పున్నమి సందర్భంగా తీరంలో స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో సకల ఏర్పాట్లు చేశారు. కాశీలో గంగా హారతి మాదిరిగా బాపట్ల మండలంలోని సూర్యలంక తీరంలో భూగర్భ సాగర హారతికి ఏర్పాట్లు చేశారు. రుత్వికులు, పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయించి సాగరుడికి హారతి ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు హాజరయ్యే లక్షల మంది భక్తుల కోసం సకల ఏర్పాట్లు చేశారు. కార్తిక పున్నమి సందర్భంగా లక్ష మందికిపైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. కలెక్టర్ రంజిత్ బాషా ఆధ్వర్యంలో డీఆర్వో రవీందర్ తీరంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే తాగునీటి సదుపాయాలు కల్పించారు. భక్తులు దీపాలు వెలిగించుకునేందుకుగాను తీరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో తీరంలో మూడు ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. సూర్యలంక మార్గంలోని ఆర్మీ క్యాంటీన్ వద్ద వాహనాల పార్కింగ్ కోసం స్థలం కేటాయించారు. వీఐపీలు, వీవీఐపీల కోసం ప్రత్యేక మార్గాలను నిర్దేశించారు. తీరంలో ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. ఎప్పటికప్పుడు భక్తుల కదలికలను పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూములు రెడీగా ఉంచారు.

భక్తుల కోసం సకల ఏర్పాట్లు



సూర్యలంక తీరంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా అన్ని రకాల ఏర్పాట్లు చేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు షామియానాలు, మొబైల్ టాయిలెట్లు, ప్రత్యేక స్నానాల గదులు సిద్ధంగా ఉంచాం. సుమారు లక్ష మందికిపైగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నాం. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గజఈతగాళ్లను రెడీగా ఉంచాం. ఇక్కడ భూగర్భ సాగర హారతి ప్రత్యేకంగా నిలవనుంది.

–గంధం రవీందర్, జిల్లా రెవెన్యూ అధికారి, బాపట్ల

భిన్న లైంగిక ధోరణుల సమూహాలపై నిర్లక్ష్యం తగదు

- తగిన పాలసీలు, రిజర్వేషన్లతోనే వ్యవస్థలోకి దారి
- అన్ని పోరాటాల వాళ్లు అర్థం చేసుకుని మద్దతునివ్వాలి
- 'అర్ధనారి'పై చర్చావేదికలో ట్రాన్స్, హిజ్రా రైట్స్ యాక్టివిస్ట్ రచన ముద్రబోయిన



మాట్లాడుతున్న రచన ముద్రబోయిన

తెనాలి: సమానత్వం ప్రకృతిలోనే లేనపుడు...కులం, మతం, క్లాస్...అన్నట్టుగా ఉన్న సమాజంలో దూరంగా నెట్టివేయబడుతున్న కొందరిని ద్వేషించటం తగదని ట్రాన్స్, హిజ్రా రైట్స్ యాక్టివిస్ట్ రచన ముద్రబోయిన అభిప్రాయపడ్డారు. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక సంస్థ 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో నెలనెలా నిర్వహిస్తున్న చర్చావేదికలో భాగంగా శనివారం సాయంత్రం బండి నారాయణస్వామి నవల 'అర్ధనారి'పై చర్చావేదిక నిర్వహించారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన కార్యక్రమానికి జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. హైదరాబాద్‌కు చెందిన రచన ముద్రబోయిన మాట్లాడుతూ ఆడ, మగ జెండర్ రాజకీయాల చుట్టూ తిరిగే వ్యవస్థలో భిన్న లైంగిక ధోరణులు కలిగిన సమూహాలపై సమాజం ఎంత అమానుషంగా ప్రవర్తిస్తోంది అనే ఆలోచనే చేయటం లేదన్నారు. నిజానికది తమ దృష్టిలో క్రూరమైనదిగా చెప్పారు. తగిన పాలసీలు, రిజర్వేషన్లు లేనపుడు హిజ్రాలు, ట్రాన్స్‌జెండర్లు వ్యవస్థలోకి వచ్చేందుకు తగిన దారే లేదన్నారు.

తమలాంటి ట్రాన్స్‌జెండర్లకు తగిన రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు తమ పోరాటాలే సరిపోవన్నారు. అన్ని పోరాటాల వాళ్లు అర్థం చేసుకుని తగిన మద్దతునివ్వాలని కోరారు. హిజ్రా లీడర్, టీటీపీఏ వ్యవస్థాపకులు కేఎస్‌వీ మోనాలిసా మాట్లాడుతూ హిజ్రా/ట్రాన్స్‌జెండర్లకు చదువు, వసతి, ఉపాధికి తగిన రిజర్వేషన్లు కావాలని చెప్పారు. వీరిపట్ల కుటుంబం, సమాజం చూసే దృక్పథం మారాల్సి ఉందన్నారు. గురు-చేలా వ్యవస్థ తమకో రక్షణ ఛత్రమని చెబుతూ ఒకరికొకరం సహకరించుకుంటామని తెలిపారు. వీరిలో చదువుకుని స్థిరపడుతున్న వారికి తగిన తోడ్పాటు కావాలన్నారు. హైకోర్టుకు వెళ్లి కొన్ని హక్కులను సాధించుకున్నామని చెబుతూ, తమకోసం తెలుగు రాష్ట్రాలు కొన్ని చట్టాలను తేవటం సంతోషంగా ఉందన్నారు. 'చినుకు' సంపాదకుడు రాజగోపాల్ మాట్లాడుతూ రొటీన్‌గా మారిపోయిన జీవితాల్లో మనది కాదనుకుంటున్న ప్రపంచాన్నీ, మన వ్యవస్థే అంగీకరించని మనుషుల గురించి నారాయణస్వామి 'అర్ధనారి' నవలలో గొప్పగా రాశారని చెప్పారు. పుస్తకం చదివాక నిత్యం మనకు కనిపించే ట్రాన్స్‌జెండర్లను చూసే మన దృక్పథం మారుతుందని చెప్పారు. కవి జుగాష్‌వలి పర్యవేక్షించారు.

క్లుప్తంగా

జిల్లా ఖోఖో జట్టు శిక్షణ పూర్తి



జే.పంగులూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర ఖోఖో జట్టుకు శిక్షణ శనివారంతో ముగిసింది. స్థానిక మాగుంట సుబ్బరామి రెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో గత 20 రోజుల నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ జరుగుతున్నట్లు రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. శనివారం జట్టుకు శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ పంగులూరులో శిక్షణ తీసుకున్న జట్టు అండర్–14 విభాగంలో ఈ నెల 26 నుంచి 28 వరకు జరిగే 33వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. క్రీడాకారులకు దుస్తులను వంకాయలపాడు గ్రామానికి చెందిన భవనం ప్రసన్నాంజనేయరెడ్డి, భవనం శ్రీమన్నారాయణరెడ్డి తండ్రి భవనం అంజిరెడ్డి జ్ఞాపకార్థం అందించారని చెప్పారు. వీటి విలువ సుమారు రూ. 15 వేలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భవనం కాశీవిశ్వనాథరెడ్డి, జిల్లా ట్రెజరర్ కె. హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టు..

ఏ. శ్రీనివాస్ (పంగులూరు), ఎం. కేశవ (పంగులూరు), జి. సందీప్ (కనిగిరి), కె. సాయి (కేవీ పాలెం), ఎస్. నాగచైతన్య (పంగులూరు), యు. ఆకాష్ (పంగులూరు), ఏ. నవనీత్ కుమార్‌రెడ్డి (కేవీ పాలెం), పి. వెంకటేశ్వర్లు (పంగులూరు), టి. మనోజ్ (కేవీ పాలెం), ఆర్. వెంకటేష్ (రుద్రవరం), ఏ. మధుబాబు (పంగులూరు), కె. విష్ణువర్ధన్ (పంగులూరు), మోహన్‌కుమార్ (కేవీ పాలెం), నందకిశోర్ (గంగవరం).

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రేమసాగర్ విజయదుందుభి

రాష్ట్రస్థాయిలో సిల్వర్, స్కూల్ గేమ్స్‌లో బంగారు పతకాలు స్వాధీనం



స్కూల్ గేమ్స్‌లో ప్రేమసాగర్



రాష్ట్రస్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ అందుకున్న ప్రేమసాగర్

చీరాల రూరల్: రాష్ట్రస్థాయిలో సిల్వర్, స్కూల్ గేమ్స్‌లో బంగారు పతకాలు సాధించి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్నాడు ప్రేమసాగర్. చీరాల మండలం సాయికాలనీకి చెందిన దేవరకొండ ప్రవీణ్ కుమార్ కుమారుడు ప్రేమసాగర్ వెయిట్ లిఫ్టింగ్‌లో తనదైన శైలితో దూసుకుపోతున్నాడు. తాజాగా రాష్ట్రస్థాయిలో, స్కూల్ గేమ్స్‌లో పాల్గొని సత్తాచాటి పతకాలు కైవసం చేసుకున్నాడు. ఈనెల 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేటలో ఏపీ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. అండర్–19 యూత్ 81 కేజీల విభాగంలో పాల్గొన్న ప్రేమసాగర్ 274 కేజీల బరువులు ఎత్తి ద్వితీయ స్థానంలో నిలిచి, సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. నాలుగు రోజుల వ్యవధిలో ఈనెల 23, 24, 25 తేదీల్లో కర్నూలులో జరిగిన స్కూల్ గేమ్స్‌లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ప్రేమసాగర్ 261 కేజీల బరువులు ఎత్తి మొదటి స్థానంలో నిలిచి, గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. అయితే, ప్రేమసాగర్ ఐటీఐ (ఫిట్టర్) రెండో ఏడాది చదువుతున్నందున స్కూల్ గేమ్స్‌లో పాల్గొనేందుకు పోటీల నిర్వాహకులు అనుమతులు ఇవ్వలేదు.

హైకోర్టుకు వెళ్లి..

స్కూల్ గేమ్స్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు మాత్రమే పాల్గొనాలనే నిబంధన ఉంది. పదో తరగతి తరువాత ఐటీఐ కోర్సు కూడా రెండేళ్లు కాబట్టి ఇంటర్మీడియెట్‌తో సమానమని అతని తండ్రి పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడైన ప్రవీణ్ కుమార్ హైకోర్టు ద్వారా ప్రేమసాగర్ స్కూల్ గేమ్స్‌లో పాల్గొనేందుకు ఆర్డర్ పొందాడు. అదే ఆర్డర్‌తో పోటీల్లో పాల్గొన్న ప్రేమసాగర్ అన్ని విభాగాల్లో రాణించి బంగారు పతకం సాధించాడు. రాష్ట్రస్థాయి, స్కూల్ గేమ్స్‌లో విశేష ప్రతిభ కనబరచి పతకాలు సాధించిన ప్రేమసాగర్‌కు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ పున్నారావు, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బడేటి వెంకట రామయ్య, అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ, కోచ్ దీనీషబాబు, క్రీడాభిమానులు, సహ విద్యార్థులు అభినందనలు తెలిపారు.

పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్బుల ఏర్పాటు

బాపట్ల అర్బన్: జిల్లాలో వినియోగదారుల ఉద్యమాన్ని మరింత చైతన్యవంతం చేయడంలో భాగంగా ప్రతి పాఠశాలలో క్లబ్బులు ఏర్పాటు చేయనున్నట్లు విద్యాశాఖాధికారి పి.వి.జె. రామారావు తెలిపారు. పట్టణంలోని బాపట్ల పబ్లిక్ స్కూలులో శనివారం వినియోగదారుల క్లబ్బులు, చైతన్యపరిచే తొమ్మిది రకాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు హక్కులు, పరిష్కార విధానాల గురించి అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన వినియోగదారులుగా వ్యవహరించేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. జిల్లాలోని 212 వినియోగదారుల క్లబ్బుల ద్వారా ప్రతీ నెలా సెమినార్లు, వర్క్‌షాప్‌లు, చర్చలు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, శ్రీనివాస రావు, ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ అదాలత్‌ను జయప్రదం చేయండి



నరసరావుపేట టౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి టి.ప్రవల్లిక కోరారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం డివిజన్‌లోని పోలీస్ అధికారులతో కోర్టు ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే దిశగా పోలీస్ అధికారులు కృషి చేయాలన్నారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించబడతాయని చెప్పారు. అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకొని విలువైన సమయాన్ని వృథా కాకుండా కాపాడుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు అశోక్ కుమార్, వీరేంద్రబాబు, రూరల్ సీఐ కృష్ణయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.

సబ్‌జైలును సందర్శన..

ఖైదీలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని న్యాయమూర్తి టి.ప్రవల్లిక, సబ్ జైల్ అధికారులను ఆదేశించారు. జైలు అదాలత్‌లో భాగంగా శనివారం సబ్ జైలును సందర్శించిన ఆమె ఖైదీలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదుల్ని ఏర్పాటు చేసుకోలేని పేదలు ఎవరైనా ఉంటే మండల న్యాయ సహాయక కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

పల్నాటి వీరుల ఆయుధాలకు పునః ప్రతిష్ట



చెన్నకేశవస్వామి గుడి ఆవరణలో పీఠాధిపతి తరుణ్‌చెన్నకేశవతో వీరాచారవంతులు

కారెంపూడి: పల్నాటి వీరుల ఆయుధాలకు పునః ప్రతిష్టను శనివారం స్థానిక పల్నాటి చెన్నకేశవ స్వామి ఆలయంలో నిర్వహించారు. పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ప్రత్యేక క్రతువుల నిర్వహించిన అనంతరం పునః ప్రతిష్ట చేశారు. ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలం గంగవరం గ్రామానికి చెందిన గడిబోయిన వెంకయ్య, గడిపూడి నరేంద్ర, మరో పది మంది పల్నాటి వీరాచారవంతులు తమ పూర్వీకుల ద్వారా సంక్రమించిన పల్నాటి వీరుల ఆయుధాలకు మరమ్మతులు చేయించుకున్న అనంతరం వాటి పవిత్రత దెబ్బతినకుండా చెన్నకేశవస్వామి సమక్షంలో పీఠాధిపతి చేతుల మీదగా పునః ప్రతిష్ట చేయించుకున్నారు. అనంతరం ఆయుధాలతో వీరాచారవంతులు పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పల్నాటి వీరాచార పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పోతురాజుకు పడిగెం

కార్తిక పౌర్ణమి ఆదివారం రాత్రి స్థానిక పల్నాటి వీరుల గుడిలో పోతురాజు శిలకు పడిగెం కట్టే కార్యక్రమం నిర్వహించనున్నట్లు పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ శనివారం తెలిపారు. రాత్రి 11 గంటలకు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. చెన్నకేశవస్వామి సన్నిధిలో ఉన్న బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహకుంతాన్ని వెలుపలికి తీసి పూజాదికాలు నిర్వహిస్తామన్నారు. రాత్రి సూరేశ్వరస్వామి దేవాలయ ముఖద్వార జ్వాల తోరణం పూర్తయిన అనంతరం బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహ కుంతంతో ఊరేగింపుగా వీరుల గుడికి చేరుకుని పోతురాజుకు పడిగెం కట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఉత్సవాలు ముగిసేంత వరకు రణక్షేత్రంలో ఉన్న వీరుల గుడి ప్రాంగణాన్ని వీడవద్దని బ్రహ్మనాయుడు పోతురాజుకు ఆన పెట్టినట్లుగా ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. పడిగెం కట్టిన తర్వాత రోజు నుంచి వీరారాధన ఉత్సవ ఏర్పాట్లు జరుగుతాయని, కార్తిక అమావాస్య డిసెంబర్ 12 నుంచి ఐదు రోజుల పాటు పల్నాటి వీరుల స్మరణ కొనసాగుతుందని పీఠాధిపతి చెన్నకేశవ వివరించారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందజేస్తున్న రామారావు

బాపట్ల అర్బన్: జిల్లాలోని భవిత కేంద్రాల్లో నూరు శాతం అంధత్వం, వినికిడి లోపంతో ఉన్న 128 మంది బాలబాలికలు పాఠ్యాంశాల్ని ఇంటివద్ద అభ్యసించేందుకు వీలుగా శనివారం సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యంలో ట్యాబ్‌లను జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు అందించారు. బాపట్ల మున్సిపల్ స్కూలు ఆవరణలోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ జిల్లాలోని 25 భవిత కేంద్రాల్లో పలు రకాల వైకల్యాలతో బాధపడే మూడు వేల మంది ప్రత్యేక అవసరాలుగల పిల్లలున్నారని వివరించారు. నిబంధనల ప్రకారం నూరుశాతం అంధత్వంతో 14మంది, వినికిడిలోపం గలవారు 114 మంది విద్యార్థులున్నారని వెల్లడించారు. ఒక్కో ట్యాబ్‌లో 23 రకాల యాప్‌లు ఉన్నాయని తెలిపారు. అంధులకు వాయిస్ రూపంలో, వినికిడి లోపంగల వారికి వీడియోలు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో త్రీడీ చిత్రాలతో బోధన ఉంటుందని వివరించారు. అవాంఛనీయ దృశ్యాలు, యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలులేకుండా ట్యాబ్‌లలో పేరెంట్ కంట్రోల్ యాప్‌ను కూడా ఇన్‌స్టాల్ చేశారని తెలిపారు. వీటి వినియోగంపై ఐఈఆర్టీలు, తల్లిదండ్రుల పర్యవేక్షణ, నిఘా ఉంటాయని చెప్పారు. డీఈవో శ్యాంసుందర్ మాట్లాడుతూ సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులపై సమగ్ర శిక్ష ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ప్రసాద్, ఎస్ఎస్ఏ విలీన విద్య కో–ఆర్డినేటర్ మట్ట జ్యోత్స్న, మునిసిపల్ హైస్కూలు ప్రిన్సిపాల్ రాజేశ్వరి, మోజేశ్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి



మోడల్ పరీక్ష విజేతలకు బహుమతి అందిస్తున్న డీఈఓ శామ్యూల్

నరసరావుపేట ఈస్ట్: ఎన్ఎంఎంఎస్ పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం హార్డ్ పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ మోడల్ గ్రాండ్ టెస్ట్ శనివారం నిర్వహించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు ఏటా రూ.12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనం లభిస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,078 మంది విద్యార్థులను స్కాలర్‌షిప్‌లకు ఎంపిక చేస్తారని వివరించారు. డిసెంబర్ 3వ తేదీన డివిజన్ కేంద్రాలలో నిర్వహించనున్న పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయుల్ని కోరారు.

కొత్త ఓట్ల నమోదుపై విచారణ చేపట్టాలి

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్

నెహ్రూనగర్: పశ్చిమ నియోజకవర్గంలో కొత్తగా నమోదైన ఓట్లపై విచారణ జరిపించాలని పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ కోరారు. ఈ మేరకు శనివారం పశ్చిమ ఈఆర్వో, అదనపు కమిషనర్ కె. లక్ష్మీశివ జ్యోతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ రూల్స్ విరుద్ధంగా ఒక బూతులోనే 70 నుంచి 160 పైగా కొత్త ఓట్లను నమోదు చేయబడ్డాయని తెలిపారు. పశ్చిమలో మొత్తం 282 పోలింగ్ బూత్‌లు ఉంటే 39 బూత్ ల్లో 3031 ఓట్లు కొత్తగా నమోదయ్యాయని చెప్పారు. బీఎల్‌ఓల ద్వారా వాటిని తక్షణమే విచారణ చేయించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

17 మంది సంగం డెయిరీ ఉద్యోగులు, సిబ్బందిపై కేసు

పోలీసులపై దౌర్జన్యం చేసిన ఘటనలో..

చేబ్రోలు: మండల పరిధిలోని వడ్లమూడి సంగం డెయిరీ వద్ద పోలీసులపై దౌర్జన్యం చేసి, విధులకు ఆటంకం కలిగించిన 17 మంది ఉద్యోగులు, సిబ్బందిపై చేబ్రోలు పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది. ఏలూరు జిల్లా పాడి రైతుల ఫిర్యాదుపై విచారణ నిమిత్తం పొన్నూరు రూరల్ సీఐ, ఎస్ఐ, చేబ్రోలు ఎస్ఐ, సిబ్బంది శుక్రవారం సంగం డెయిరీ వద్దకు వెళ్లారు. అక్కడ పోలీసులను లోపలకు రాకుండా ముగ్గురు డైరెక్టర్లు, ఉద్యోగులు, సిబ్బంది అడ్డుకున్నారు. పోలీసులను అడ్డుకోవటంతో పాటు, దౌర్జన్యం చేసి, విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు డైరెక్టర్లు, సెక్యూరిటీ ఎస్వో, ఉద్యోగులు మొత్తం 17 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. ఆనంద్ తెలిపారు.

క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

భట్టిప్రోలు: వేదాంత హాస్పిటల్స్ ఆధ్వర్యంలో స్థానిక రమా గుప్తా కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్స్ మేనేజర్ ప్రవీణ్ కళాధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కిడ్నీ, గుండె, ఎముకలు, షుగర్ వ్యాధి నిపుణులు చింతా రామకృష్ణ, ఎ. తిరుమల నరేష్, శ్రీనివాస్ పోలిశెట్టి, మంజుల శ్రీరామ్ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి వికసిత్ భారత్ సదస్సులు

రేపల్లె రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు తీరుపై గ్రామీణ ప్రాంతాలలో ఆదివారం నుంచి జనవరి 26 వరకు వికాసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివపార్వతీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి ఉత్సవ్ కమిటీలు, గ్రామ స్థాయి కల్చరల్ కమిటీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కమిటీలలో ఉన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్దేశించిన తేదీల్లో గ్రామాలలో పర్యటించి ప్రభుత్వ పథకాలను వివరిస్తారని తెలిపారు. మొదటి రోజు మండలంలోని బేతపూడి, గుడికాయలంకలో సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం

రేపల్లె: పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో శనివారం ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ టీసీ రవిచంద్రకుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి, మంచి భవిష్యత్ లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్ బాలగురవయ్య, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎల్వోలకు గుర్తింపు కార్డులు



రేపల్లె రూరల్: ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న బీఎల్వోలకు, సూపర్‌వైజర్లకు ఆర్డీవో హేలా షారోన్ శనివారం మునిసిపల్ సమావేశ మందిరంలో గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఓటు గుర్తింపు కార్డుల మార్పులు, చేర్పులతో పాటు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకునే విధంగా పని చేయాలని సూచించారు. డిసెంబర్ 9 వరకు ఓటర్ల చేర్పులు, మార్పులు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. రాజకీయ పార్టీల నుంచి అభ్యంతరాలు రాకుండా పనిచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మల్లికార్జునరావు, కమిషనర్ విజయసారథి పాల్గొన్నారు.

మూగ జీవాలను రక్షించుకుందాం



కర్లపాలెం: మూగ జీవాలను రక్షించుకుందామని కర్లపాలెం శ్రీగురువాణి పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యులు కూనం చంద్రశేఖర్ రావు అన్నారు. మాంసాహారం వద్దు శాఖాహారమే ముద్దు అంటూ పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఇండియా ఆధ్వర్యంలో శనివారం శ్రీగురువాణి పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యులు కర్లపాలెంలో ర్యాలీ నిర్వహించారు. శాఖాహారమే అమృతాహారమని తెలిపారు. శాఖాహారిగా జీవించు.. ప్రతి జీవిని ప్రేమించు అంటూ ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, భాస్కర్, నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



భట్టిప్రోలు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి అన్నారు. భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్(బీఎఫ్ఏ) ఆధ్వర్యంలో శనివారం 200 మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బీఎఫ్ఏ నిర్వాహకులను అభినందించారు. బీఎఫ్ఏ అధ్యక్షులు బి. గోపీనాథ్, నిర్వాహకులు దొంతు ఆదినారాయణ, షేక్ మస్తాన్, భారతుల శ్రీధర్, వంగర చలమయ్య సిద్ధాంతి, విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి శివరామప్రసాద్, మొకరాల పెద వెంకట్రావు, బూర్లె కిరణ్ కుమార్, వంగర బాబూజీ, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం సాకారం

ఎమ్మెల్యే కోన రఘుపతి



భవనంవారిపాలెం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

భవనంవారిపాలెం (కర్లపాలెం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాల వ్యవస్థతో బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కల సాకారమైందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండలంలోని భవనంవారిపాలెం సచివాలయం వద్ద శనివారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పంచాయతీ పరిధిలోని చోడిపాలెం వైఎస్సార్ రచ్చబండ వద్ద వైఎస్సార్ సీపీ జెండాను ఎమ్మెల్యే రఘుపతి ఆవిష్కరించారు. గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్తరెడ్డిపాలెం గ్రామం నుంచి శ్మశానవాటికకు వెళ్లేందుకు నూతనంగా నిర్మించిన రహదారిని, కుమ్మరపాలెంలో రీడింగ్ రూమ్‌ను ప్రారంభించారు. అనంతరం భవనంవారిపాలెంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామ సచివాలయం వద్ద జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ సభలో కోన మాట్లాడుతూ పేదలకు మేలు చేసే విధంగా ఎన్నికల హామీలను 98శాతం నెరవేర్చిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికలలో ముఖ్యమంత్రిగా మళ్లీ గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ ఎస్.కె.బాజీ, ఎంపీడీవో మారుతీ శేషమాంబ, వైస్ ఎంపీపీ చేబ్రోలు కృపానందం, ఎంపీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సింధు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, ఏట్ర అశ్వనీరెడ్డి, అల్లూరు లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు శివారెడ్డి, రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా పాలన

బాపట్ల : రాష్ట్రంలో అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లలా పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం నందిరాజుతోటలో శనివారం జరిగింది. నందిరాజుతోటలో చేపట్టిన అభివృద్ధి పథకాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ సచివాలయం వ్యవస్థతో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, నాయకులు మోర్ల సముద్రాలగౌడ్, పీటా వేణుగోపాల్, పీటా బాబు తదితరులు ఉన్నారు.

రూ.కోటితో ఆంజనేయస్వామి ఆలయం జీర్ణోద్ధరణ



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: బాపట్ల పట్టణంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం జీర్ణోద్ధరణ పనులు కోటి రూపాయలతో చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. ఈ మేరకు దేవాలయంలో కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. బాపట్లలో 145 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆంజనేయ స్వామి దేవాలయం శిథిలావస్థకు వచ్చినందున, జీర్ణోద్ధరణ కార్యక్రమం దేవాదాయ శాఖ సహకారంతో చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నెమలికంటి హనుమంతరావు, పూసపాటి శ్రీకాంత్, కొలను మోహన్ శ్రీనివాస్, దుద్దుకూరి హనుమంతరావు, పూసపాటి మారుతీ కుమార్, రామకృష్ణారెడ్డి, పోలూరి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్, అర్చక స్వాములు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి రూ. 1.12 కోట్లు మంజూరు



అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న సీడీపీఓ విజయలక్ష్మి

కొల్లూరు : అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతుల మెరుగుపర్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ విజయలక్ష్మి తెలిపారు. శనివారం కొల్లూరులో ప్రాజెక్టు పరిధిలోని కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు మండలాల్లోని శాశ్వత భవనాలు ఉండి, అభివృద్ధి పనులకు ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రాజెక్టు పరిధిలోని ఐదు మండలాల్లో 125 అంగన్‌వాడీ భవనాలకు రంగులు, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్తు, మంచినీటి సదుపాయం కల్పనకు ప్రభుత్వం రూ. 1.12 కోట్లు మంజూరు చేసిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో కేంద్రీకృతమైన సమస్యలను నాడు–నేడులో భాగంగా శాశ్వతంగా పరిష్కరించేందుకు మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకుని త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమన్వయం చేసుకుంటూ నిర్దేశించిన పనులను నిబంధనలను అనుసరించి చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హజరున్నీస, శాంతి, వెంకటరమణ, విజయలక్ష్మి, మాధవి, నగరాజకుమారి పాల్గొన్నారు.

తీరంలో కార్తీక పౌర్ణమి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు



మోర్తోట వద్ద ఘాట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో హేలా షారోన్

రేపల్లెరూరల్: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతంలోని ఆలయాల్లో పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆర్డీవో హేలా షారోన్ తెలిపారు. పెనుమూడి కృష్ణా ఘాట్, మోర్తోటలోని ముక్తేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లను శనివారం ఆమె పరిశీలించారు. ముక్తేశ్వరస్వామి ఆలయానికి స్థలపురాణం ఉండటంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. ఆలయ ఆవరణంలోని కృష్ణానదిలో భక్తులు స్నానమాచరించే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా.. ముందస్తు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు లోతట్టు ప్రాంతంలోకి వెళ్లకుండా అప్రమత్తం చేస్తున్నామన్నారు. అదేవిధంగా మహిళలు వస్త్రాలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఆలయ ఆవరణంలో పూజలు నిర్వహించుకునే ప్రాంతంలో పారిశుద్ధ్యం లోపించకుండా పర్యవేక్షించాలన్నారు. పెనుమూడి ఘాట్ వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆమె వెంట తహసీల్దార్ మల్లికార్జునరావు, పట్టణ సీఐ నజీర్‌బేగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీలంతా ఐక్యతగా ఉంటాం



బాపట్ల అర్బన్: కాంగ్రెస్ పార్టీ కోసం మైనార్టీలంతా కలిసి ఐక్యతగా పనిచేస్తామని ఆ పార్టీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు పఠాన్ రాజేష్ అన్నారు. బాపట్ల పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు జేడీ శీలం ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు గంట అంజిబాబు ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద శనివారం నియోజకవర్గ మైనార్టీ కమిటీ ఎన్నిక జరిగింది. బాపట్ల పట్టణ అధ్యక్షుడిగా అమాన్ ఉల్లా బేగ్, నియోజకవర్గ మైనార్టీ కన్వీనర్‌గా నజీర్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా కరీముల్లా, పట్టణ ఉపాధ్యక్షుడిగా అమీర్ బేగ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మీరావల్లి, బషీర్, రషీద్ పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- నేతాజీ నగర్‌లో కార్డన్ సెర్చ్, పాల్గొన్న డీఎస్పీ మురళీకృష్ణ, సిబ్బంది
- 22 ద్విచక్ర వాహనాలు, ఆటో సీజ్



24వ వార్డులో కార్డన్ సెర్చ్‌లో డీఎస్పీ మురళీకృష్ణ, పోలీసు సిబ్బంది

రేపల్లె రూరల్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని డీఎస్పీ టి.మురళీకృష్ణ హెచ్చరించారు. పట్టణంలోని 24వ వార్డులో శనివారం పోలీసు సిబ్బందితో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు పట్టణంలోని నేతాజీ నగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. మాదక ద్రవ్యాలు గంజాయి, కొకైన్ వంటి పదార్థాలు విక్రయించినా, వాహన దొంగతనాలకు పాల్పడిన సహించేది లేదన్నారు. అనుమానస్పద స్థితిలో కొత్త వ్యక్తులు సంచరించినా, వారిపై అనుమానాలు తలెత్తినా వెంటనే పోలీసు స్టేషన్‌లో తమ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్‌లకు చెందిన 78 మంది పోలీసులు వార్డులోని వివిధ గృహాలలో తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను సీజ్ చేశామన్నారు. కార్యక్రమంలో సీఐ నజీర్‌బేగ్, వివిధ పోలీసుస్టేషన్‌ల ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హింసలేని సమాజం రూపుదిద్దుకోవాలి



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్



విద్యార్థినుల ప్రదర్శన



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ కేశవనారాయణరావు

రేపల్లె: మహిళలపై హింసకు పాల్పడే మృగాలను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్ అన్నారు. హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు ప్రభుత్వాలు రక్షణ వ్యవస్థతో పాటు సమాజంలో పౌరులుగా విద్యార్థులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్, ఎస్ఎఫ్ఐ గాల్స్ పట్టణ కోకన్వీనర్ హేమ, కళాశాల ప్రిన్సిపల్ రజనీబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్, మహాలక్ష్మి, వరలక్ష్మి, నాగరాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాల రక్షణ

బాపట్ల అర్బన్: స్థానిక బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో స్త్రీ హింస వ్యతిరేఖ దినోత్సవం శనివారం నిర్వహించారు. ఇంటర్నల్ కంప్లయింట్స్, ఎంపవర్‌మెంట్ కమిటీ, నేషనల్ సర్వీసెస్ స్కీమ్ యూనిట్–3 ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మహిళా పోలీస్ జ్యోతి పాల్గొన్నారు. మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు దోప్పలపూడి రామ్మోహన్‌రావు, గెల్లి దిలీప్‌కుమార్, సెక్రెటరీ మానం నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ కొమ్మినేని హరి పద్మ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ నజీర్, ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ జె.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మాసోత్సవాలు ప్రారంభం

భట్టిప్రోలు: ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ మాసోత్సవ కార్యక్రమాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి ముఖ్య అతిథులుగా పాల్గొని, పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. రైల్వే గేట్ వద్ద మానవహారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖర రావు, ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రా స్వరాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, ఏపీవో శివ పార్వతి, హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య, స్త్రీ నిధి ఏరియా మేనేజర్ పిల్లి అశోక్, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి

కర్లపాలెం: సమాజంలోని ప్రతి మహిళను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తహసీల్దారు కేశవనారాయణరావు అన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం కర్లపాలెంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం మహిళలంతా ర్యాలీ నిర్వహించి, పాల కేంద్రం సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణకు దిశ చట్టం తీసుకువచ్చిందని చెప్పారు. ప్రతి ఒక్కరికీ ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ జిల్లా రీసోర్స్ పర్సన్ పి.జోయబాబు, ఏపీఎం శ్రీనివాసులరెడ్డి, బాపట్ల ఏరియా కో–ఆర్డినేటర్ యు.సుబ్బారావు, ఏఎస్ఐ సాంబశివరావు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, పశు వైద్యాధికారి రేచల్ దివ్య, హౌసింగ్ ఏఈ అన్వర్ భాష, సీసీలు పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు, లక్ష్మీ సోమేశ్వరి, వీవోఏలు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల అధ్యాపకుడి పరిశోధనకు పురస్కారం



బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాల అధ్యాపకుడు డాక్టరు బి.సాయి సిద్దార్థ నాయక్‌కు ఐసీఏఆర్ నుంచి ఉత్తమ పురస్కారం దక్కింది. ఈ మేరకు ఐసీఏఆర్ గోవాలో ఈ నెల 22, 23 24వ తేదీల్లో నిర్వహించిన సమావేశంలో పురస్కారాన్ని అందించారు. ఆధునిక సేంద్రియ వ్యవసాయంలో డాక్టరు బి.సాయి సిద్దార్థ నాయక్ చేపట్టిన పరిశోధనకు ఈ పురస్కారం లభించింది. పురస్కారం రావటంపై కళాశాల పాలక మండలి అభినందనలు తెలిపింది.

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రేపల్లె: రాజ్యాంగ అమలుతోనే భారతావనికి సంపూర్ణ స్వాతంత్య్రం సిద్ధించిందని, రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టీసీ రవిచంద్రకుమార్ అన్నారు. ఈ నెల 26న 74వ రాజ్యాంగ ఆమోదిత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కళాశాలలో రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సారథ్యంలో రూపొందిన రాజ్యాంగంతోనే సమ సమాజాభివృద్ధి నిర్మాణం సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రాజనీతిశాస్త్ర అధ్యాపకురాలు సుభాషిణి, అడ్వకేట్ ప్రభాకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవం

భట్టిప్రోలు: భారత రాజ్యాంగ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవం పురస్కరించుకుని భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ చిత్రపటాలకు ఖద్దరు మాలలు సమర్పించారు. రాజ్యాంగ పీఠిక చిత్ర పటాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ పి. మల్లికార్జునరావు, ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, ఎం. శ్రీ సత్యరత్న, డి. లక్ష్మి పార్వతి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో జనరిక్ మందుల షాపు ప్రారంభం

గుంటూరు మెడికల్: జీజీహెచ్ క్యాజువాలిటీ ఎదుట డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపును జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా చౌక ధరలో జనరిక్ మందుల్ని రోగులకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య కమిటీ అధ్యక్షురాలు ఏ.శారమ్మ, కార్యదర్శి ఎం.ఝాన్సీరాణి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, జనరిక్ మందుల షాపు ఇంచార్జి షంషేర్, స్త్రీ నిధి డైరెక్టర్ కె. అరుణ, జిల్లా సమాఖ్య కమిటీ సంయుక్త కార్యదర్శి చల్లా వాసంతి, కార్యవర్గ సభ్యులు కాకుమాను భూదేవి, బి. నాగరత్నం, జి. మల్లీశ్వరి పాల్గొన్నారు.

330 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

డీలర్‌పై క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశాలు




అక్రమంగా నిల్వ చేసిన బియ్యం బస్తాల వద్ద విజిలెన్స్ అధికారులు

నగరంపాలెం: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీలర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు ఏటీ అగ్రహారం 19/1 అడ్డ రోడ్డులోని చౌక ధరల దుకాణంలో అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. రికార్డు ప్రకారం 100 బస్తాల కన్నా అదనంగా 230 బస్తాల బియ్యాన్ని గుర్తించారు. అక్రమంగా నల్లబజారు తరలించేందుకు డీలర్ నిల్వ చేసినట్లు విచారణలో బహిర్గతమైంది. డీలర్ ఉగ్గం శకుంతలపై 6–ఎ, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానిక పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్‌ను ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐలు ఎ.శ్రీహరిరావు, ఎస్.శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ చిరునామాలతో డెలివరీ చలానాలు

- 80 గ్యాస్ సిలిండర్ల లారీ స్వాధీనం
- నిత్యావసర సరుకుల చట్టం కింద కేసులు నమోదు



పట్టుబడిన సిలిండర్ల ట్రాలీతో సీఐ శ్రీనివాసులు రెడ్డి, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు

నగరంపాలెం: నకిలీ చిరునామాలతో డెలివరీ చలానాలున్న గ్యాస్ సిలిండర్ల లారీని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు శనివారం విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు నగరంపాలెంలోని చౌకింగ్ హోటల్ వద్ద గ్యాస్ సిలిండర్ల లారీని తనిఖీ చేశారు. నకిలీ చిరునామాలతో డెలివరీ చలానాలను గుర్తించారు. వ్యాపార అవసరాలకు వాడే గ్యాస్ సిలిండర్లు దుర్గా సాయి గ్యాస్ ఏజెన్సీ (సూపర్ గ్యాస్) విజయవాడ చిరునామాతో ఉన్నాయి. అందులో గ్యాస్ కిట్, బరువు కొలిచే యంత్రం, అగ్నిమాపక పరికరాలు లేకపోవడాన్ని గుర్తించినట్లు విజిలెన్స్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. లారీలో పరిమితికి మించి గ్యాస్ సిలిండర్లు ఉన్నాయని చెప్పారు. దీంతో 71 ఫుల్ గ్యాస్ సిలిండర్లు, తొమ్మిది ఖాళీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. నిత్యావసర సరుకుల చట్టం 6–ఎ కింద కేసులు నమోదు చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారుల్ని ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్ తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తున్న మహిళలు



మాట్లాడుతున్న చిగురుపాటి నరేష్

గుంటూరు ఎడ్యుకేషన్: అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో తొలి అడుగులు మహిళలవే అని విద్యావేత్త, కమ్యూనిటీ బిల్డర్స్ మేనేజింగ్ డైరెక్టర్ చిగురుపాటి నరేష్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ దీక్షారంబ్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా, స్ఫూర్తివంతంగా నిర్వహించారు. నరేష్ మాట్లాడుతూ మహిళ విద్యావంతురాలయితే మూడు తరాలు అభివృద్ధి చెందుతాయన్నారు. స్ఫూర్తిదాయకులైన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ములను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అవాంతరాల్ని అధిగమిస్తూ, అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటూ, అనుకున్న లక్ష్యాల్ని సాధించాలని తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయవాది మన్నవ ఆర్‌కేఎం షోడేకర్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ ముందున్న బాధ్యతల్ని గుర్తెరిగి నడుచుకోవాలని సూచించారు. ఏడో అడిషనల్ సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.జ్యోత్స్న మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన ప్రభుత్వ మహిళా కళాశాల తనలాంటి వేలాదిమంది పూర్వ విద్యార్థినుల జీవితాల్లో వెలుగులు నింపిందని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్.జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ కళాశాలలో ఉద్యోగాల సాధనే పరమావధిగా నిష్ణాతులైన అధ్యాపకులతో విద్యాబోధన అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో స్టూడెంట్ యూనియన్ కన్వీనర్ కె.సుబ్బరత్నం, స్టూడెంట్ యూనియన్ అధ్యక్షురాలు కె.ప్రియశ్రీ , డాక్టర్ పి.విజయలక్ష్మి, డి.ఉమ, టి.ప్రణయజ, ధాత్రికుమారి పాల్గొన్నారు.